

మదనపల్లె డిఎస్‌పిగా ప్రసాద్‌రెడ్డి



ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా గురువారం ప్రసాద్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డిఎస్‌పి కేశప్ప ఎఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా ఇటీవల ఎస్‌ఐ, సిఐ, డిఎస్‌పిల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో అనంతపురం అర్బన్ డిఎస్‌పిగా పనిచేస్తున్న ప్రసాద్‌రెడ్డి మదనపల్లి డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పిని సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

టమోటా ధర ఢమాల్



మదనపల్లి మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

ప్రజాశక్తి-మదనపల్లె

మొన్నటి వరకు ఏకంగా రూ.రెండు వందలుపైన పలికిన టమోటాలు ఇప్పుడు రికార్డు స్థాయిలో తగ్గాయి. మదనపల్లె మార్కెట్లో ఊహించని విధంగా టమోటా ధరలు పతనమయ్యాయి. టమోటా దిగుబడి పెరగుతుండటంతో ధరలు దిగివస్తున్నాయి. ఇక్కడి వాతావరణం టమోటా సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు ఏడాదికి వివిధ దశల్లో రెండు, మూడు పంటలను సాగుచేస్తుంటారు. వరికి ప్రత్యామ్నాయంగా టమోటా వల్ల ఎంత నష్ట వచ్చినా పోగొట్టుకొన్న చోటే తిరిగి రాబట్టు కోవాలనే చందంగా

రైతుల్లో ఆందోళన

రైతులు టమోటా సాగుపైనే గంపెడాశతో ముందుకు సాగుతున్నారు. జూదం కంటే గోరంగా టమోటా రైతులు పరిస్థితి తయారైంది. ఈ సమయంలో మద్దతు ధరలు లభిస్తే పెట్టుబడులు ఖర్చులు రాబట్టుకోవడం జరుగుతుందని, లేదంటే అప్పులు ఊబిలో చిక్కుకుపోవాల్సిందేనని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం తగ్గిన ధరలతో టమోటాలను రైతులు ఎక్కడ ధరలు ఆశాజనకంగా, అధికంగా పలుకుతూ ఉంటే ఆయా మార్కెట్లుకు తరలిస్తున్నారు. మదనపల్లె, గుర్రంకొండతో పాటు అటు తమిళనాడు, కర్ణాటకాలోని కోలార్ వడ్డిపల్లె మార్కెట్‌లకు కాయలు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. టమోటా పంట సాగులో రోజు రోజుకు పెట్టుబడి ఖర్చులు పెరగడం, ఎరువుల వినియోగం, క్రిమి సంహారక మందుల వాడకంతో పాటు ఆకాశాన్నంటుతున్న కూలీల ఖర్చులు, పెరిగిన పెట్రోల్, డీజల్ ధరలతో రవాణా ఛార్జీలు తడిసి మోపెడు అవుతున్నాయి. రైతులు ఒక ఎకరా టమోటా సాగు చేయాలంటే లక్ష రుపాయలకుపైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇంత చేసిన కేవలం ఆరు లేదా ఎనిమిది కోతలు కోయగానే మొత్తం దిగుబడులు ఖాళీ అవుతున్నాయి. మదనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం పలికిన 10 కిలోలకు టమోటా ధరలు ఇలా వున్నాయి. ఇందులో 1వ రకం కనిష్ట ధర రూ.134, గరిష్ట ధర రూ.180, మోడల్ ధర 160గా పలికాయి. 2వ రకం కనిష్ట ధర రూ.80, గరిష్ట ధర రూ.130, మోడల్ ధర రూ.110గా నమోదైయ్యాయి. మార్కెట్‌కు మొత్తం సరుకు 113 మెట్రిక్ టన్నులు టమోటాలు వచ్చాయి.

అంగన్వాడీలకు సమ్మె కాలపు వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీలతో గత నెల 22న చర్చల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన అంశాలలోని సమ్మకాలపు వేతనం చెల్లిస్తామని చెప్పి మరో నెల అయినప్పటికి ఇవ్వలేదని వెంటనే ఇచ్చి అంగన్వాడీలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి. రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత డిశంబర్ 12 నుండి జనవరి 22 వరకు సమ్మె చేయగా ప్రభుత్వం దిగి వచ్చి చర్చలు జరిపి అన్ని రకాల డిమాండ్లు నెరవేరుస్తామని చెప్పారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో సమ్మె చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు 2 నెలల వేతనాలు, రెండు నెలల సెంటర్ అద్దెలు, ఒక నెల కూరగాయల బిల్లులు 2022 అక్టోబం నుంచి ఇప్పటి వరకూ 16 నెలల ఈవెంట్స్ బిల్లులు ఇవ్వలేదని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా వర్కర్లకు, మినీ వర్కర్లకు. హెల్పర్ల కు జీతాలు 2,3 నెలల పాటు ఇవ్వకపోవడంతో పాటు సంబేపల్లి లోని దేవపట్ల శెట్టిపల్లి వర్కర్లకు 2022 ఆగస్ట్ ఒక నెల వేతనం ఇవ్వలేదన్నారు. హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. సూపర్ వైజర్లు చెబితే సమ్మె విరమించలేదన్న అంశాన్ని మనసులో పెట్టుకుని వేధిస్తున్నారని వారు తమ వైఖరి మార్చుకోవాలని లేకపోతే భవిష్యత్‌లో వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మూడు యాప్‌లు కలసి ఒక యాప్‌గా



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణ

వెంటనే మార్చి తీవ్ర పనిభారం నుంచి ఉపశమనం కలిగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు - నేడు పనుల్లో అంగన్వాడీల మీద ఒత్తిడి తగ్గించాలని పేర్కొన్నారు. పై డిమాండ్ల అమలకు విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ సానుకూలంగా స్పందించినప్పటికీ అమల్లో జాప్యం జరుగుతోందని వెంటనే పెండింగ్ వేతనాలు బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. లేకపోతే ఆందోళనలకు. సిద్దమవుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు వి.సిద్దమ్మ సెక్టార్ లీడర్లు డి.విజయమ్మ ఆర్ .సుమలత, ఎస్. నసీబ్ జాన్ పాల్గొన్నారు.

వైవీయూ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

29 మంది విద్యార్థులకు అస్వస్థత
మెరుగైన వైద్యం అందించాలి : విద్యార్థి సంఘాలు



రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడపలోని యోగి వేమన విశ్వ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి వైవీయూ వసతి గహంలో భోజనం చేసిన తర్వాత విద్యార్థులు వాంతులు, విరోచనాలు చేసుకొని అస్వస్థతకుగురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. కలుషిత ఆహారం తినడం వల్లనే అన్వస్థతకు గురయ్యారు. వైవీయూ వసతి గృహంలో ప్రతిరోజు విద్యార్థులు రాత్రి 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు భోజనం చేస్తారు. రాత్రి భోజనంలో అన్నం, వంకాయ కూర, రసం, పెరుగును విద్యార్థులకు వసతి గృహంలో వడ్డించారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి బోజనం చేసిన విద్యార్థులు 10.30 గంటల ప్రాం తంలో అస్వస్థతకు గురయ్యారు. 10 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకొని అస్వస్థతకు గురికాగా వెంటనే వైవీయూ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి అత్యవసర విభా గంలో వైద్య సేవలు అందించారు. విద్యార్థులతోపాటే రిమ్స్‌కు వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్, కళాశాల ప్రిన్సిపల్ రఘనాథరెడ్డి చేరుకొని రాత్రంతా విద్యార్థుల దగ్గరే ఉండిపోయారు. విద్యార్థులు కోలుకోవడంతో గురు వారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వైద్యులు డిశ్చార్జి చేశారు. ఈలోగా వైవీయూ వసతి గృహంలో 8 గంటల ప్రాంతంలో మరో 19 మంది విద్యార్థులు వాం తులు, విరేచ నాలు కావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స అంది స్తున్నారు. వారిని కూడా హుటా హుటిన విద్యార్థుల సమాచారాన్ని వైవీయూ అధికా రులువారి తల్లి దండ్రులకు చేర వేశారు. విద్యార్థులు కలుషిత ఆహారం తినడం వల్లే పుడ్‌ఫాయిజన్‌కు గురయ్యారు. వైవీయూ వసతి గృహంలో విద్యా ర్థులకు నాసిరక భోజనం వడ్డి స్తున్నారని గతంలో పలు మార్లు విద్యార్థి నంఘాలు ఆందోళన బాట వట్టిన విషయం విధితమే. వారానికి ఒక్కసారి వైవీయూ ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి హాస్టల్‌ను తనిఖీ చేసి భోజన పదార్థాల నాణ్యతను పరిశీంచినట్లు తెలుస్తోంది. అయితే హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. వారి పర్యవేక్షణ లేకపోవడం వల్ల హాస్టల్ నిర్వహణ సక్రమంగా సాగడంలేదని తెలుస్తోంది.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెరుగైన వైద్యం అందించాలి : విద్యార్థి సంఘాలు

వైవీయూలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్శిటీ కో-కన్వీనర్ ఎం.ఆర్.నాయక్, ఆర్‌విఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం 500 మంది విద్యార్థులతో యూని వర్శిటీ మెయిన్ గేటు ఎదుట ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలతో చల గాటం ఆడవద్దని డిమాండ్ చేశారు. వెంటనే ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు తెలుసుకోవాలని చెప్పారు. అధికారులు అవినీతి, ఆక్రమాలకు పాల్ప డుతూ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికివదిలేశారని విమర్శించారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత, శుభ్రత లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని పేర్కొన్నారు. విసి, రిజిస్ట్రార్ దృష్టికి తీసు కువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'తినడానికి వచ్చారా.. చదువు కోవ డానికి వచ్చారా' అంటూ విద్యార్థులను వార్డెన్లు బెరి స్తున్నారని తెలిపారు. యూనివర్శిటీ హెల్త్ సెంట ర్‌లో మహిళా డాక్టర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారని చెప్పారు. సెమిస్టర్ పరీక్షలు రాయాల్సిన వారు అస్వస్థతకు గురి కావడంతో రాయలేక పోయారని, పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు నష్టం వాటిల్లితే యూని వర్శిటీ అధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరాహార దీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - సంబేపల్లె (రాయచోటి)

మార్చిలో నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లె పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమైన భావనలపై, పట్టికలపై, పటాలపై వారికి తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారిని కూడా ఉత్తీర్ణులను చేయవచ్చన్నారు. పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి కృషి, పట్టదలతో బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, ఎంఇఒ శ్రీనివాసులు,



మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

సాయి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బుజ్జి రెడ్డి, వైసిపి నాయకులు ప్రతాపరెడ్డి, ప్రముఖ లాయర్ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భువనేశ్వరికి చిత్రపటాన్ని ఇస్తున్న టిడిపి, జనసేన నాయకులు

భువనేశ్వరిని కలిసిన టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె

నిజం గెలవాలి పర్యటనలో భాగంగా మదనపల్లెకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి, టిడిపి, జనసేన నాయకులు కలిసి ఆమెకు స్వాగతం పలికారు. మదనపల్లి పట్టణం సమీపంలో గెస్ట్‌హౌస్‌లో బుధవారం రాత్రి బసచేసిన ఆమె గురువారం చిత్తూరు జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. టిడిపి, జనసేన నాయకులు పాల్గొని ఆమెకు స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దొమ్మలపాటి యశస్విజ్, మదనపల్లి నియోజకవర్గ తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై దాడి అత్యంత హేయమైన చర్య అని, దీనిని జనసేన పార్టీ ముక్తకంఠంతో ఖండిస్తోందని రాజంపేట జనసేన సమన్వయకర్త అతికారి దినేష్ పేర్కొన్నారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి టిడిపి, జనసేన కూటమికి ప్రజలలో ఉన్న ఆదరణను, నిష్పక్షపాతంగా ప్రచురించే పత్రికల పట్ల కక్ష పెంచుకుని ఓటమి భయంతో పత్రికా రంగంపై దాడికి సిద్ధపడ్డారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మూల స్తంభమైన జర్నలిజంను జగన్ అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

సైబర్ సెక్యూరిటీస్‌తో 'మిట్స్' ఎంఒయు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన సైబర్ సెక్యూరిటీకి చెందిన కొరిజో ఎడ్యుటెక్ ప్రయివేట్ లిమిటెడ్ వారితో అనుబంధ ఒప్పందం కుదర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఆ కంపెనీ బిజినెస్ మేనేజర్ జాబ్ జోయెల్ ప్రభు కుమార్, బిజినెస్ డెవలంమెంట్ ఎగ్జిక్యూటివ్ కన్నెటి జయ ప్రణయ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాలలోని విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ వర్క్, ట్రైనింగ్, వర్కుషాప్‌లు మొదలైనవి కంపెనీ ద్వారా కళాశాలలో నిర్వహించేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ గంగాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను స్వీకరిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకే పటిష్టమైన క్యూఆర్ సాంకేతికత

ప్రజాశక్తి-రాయచోటి

పదవ తరగతి ప్రశ్నా పత్రాల లీకేజీని అరికట్టడం కోసం పటిష్టమైన క్యూఆర్ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లుగా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ చర్యల ద్వారా అత్యంత పటిష్టవంతంగా నిర్వహించనుందని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల సీల్డ్ కవర్లను తెరిచేటప్పుడు సిసి టివి కెమెరాల ద్వారా పర్యవేక్షించడం, పరీక్ష కేంద్రాలలో కెమెరాలను ఏర్పాటు చేయడం, ఫ్లయింగ్ స్క్వాడ్లు, వంటి అనేక చర్యల ద్వారా పరీక్షలను పటిష్టవంతంగా నిర్వహిస్తారాన్నరు. ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలకు ముద్రించే ప్రశ్నపత్రాలలో క్యూఆర్ కోడ్ ఉంటుందని, రాష్ట్రంలో పరీక్ష రాయబోయే ప్రతి విద్యార్థికి ఇవ్వబోయే ప్రశ్నాపత్రంలో క్యూఆర్ కోడ్ వేరువేరుగా ఉంటుందని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగి, ప్రశ్నాపత్రం లీకేజీ అయితే ఆ ప్రశ్న పత్రం ఏ విద్యార్థి దగ్గర నుంచి లీక్ అయిందో క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఎవరూ ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడవద్దని సూచించారు.

రేపు మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి- రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాయచోటిలోని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్య అభివృద్ధి అధికారి బి.హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ గురువారం ఒక సంయుక్త ప్రకటన పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఆటోలివ్ ఇన్‌ఫ్లేటర్, ఇండి గ్రిడ్ కంపెనీల ప్రతి నిధులు పాల్గొంటారని తెలిపారు. ఏదైనా డిగ్రీ, డిప్లొమా పాస్ అయిన 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కల్గిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, బయో డేటా లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. అవకాశాన్ని అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగ పరచుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9550104260, 8897776368లలో సంప్రదించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

భద్రాచల వేదపండితులచే ఈ నెల 28వ తేదీన నిర్వహించే శ్రీభద్రాద్రి సీతారాముల వారి రథోత్సవం, కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అభి కన్వెన్షన్ అధినేత బెల్లం రామకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాయచోటి ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా ఒక మంచి కార్యక్రమం చేయాలను నిర్ణయించుకొన్నామన్నారు. భద్రాచలం వెళ్లి అక్కడ సీతరాముల వారిని కల్యాణం చూడాలంటే చాలా ఖర్చుతో అయ్యే పరిస్టితి ఉందన్నారు. అక్కడ జరిగే కల్యాణాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి రాయచోటి భక్తులకు స్వామి వారిని దర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 27వ తేదీన స్వామి వారి నమున మూలా విరాట్ ఉండే విదంగా రథం రాయచోటికి వస్తుందన్నారు. ఈ రథ మహోత్సవంను భక్తులు దర్శించుకునేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అభి ఫంక్షన్ హాల్ నుండి శివాలయం చెక్ పోస్ట్, బంగ్లా సర్కిల్, బస్టాండ్ రోడ్, గాలివీడు రోడ్, లక్ష్మీపురం మీదగా, మదనపల్లె రోడ్ నుండి శివాలయం మీదగా అభి ఫంక్షన్ హాల్ వరకు కొనసాగుతుందన్నారు. స్వామి వారి కల్యాణోత్సవానికి పది వేలకుపైగా ప్రజలు హాజరవుతారన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా ప్రత్యేకమైన క్యులైన్లు కుడా ఏర్పాటు చేశామన్నారు. అన్నప్రసాదం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి భక్తుడు స్వామి వారి కల్యాణంను తిలకించి స్వామి వారి కృపా కటాక్షలు పత్రులు కగాలరిని మనవి చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి సంబంధించి ప్రచార రథం తిరుగుతుందని తెలిపారు. అందరికీ పాస్‌లను అందజేస్తున్నామని చెప్పారు.



నరసింహారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా 'ఉయ్యాలవాడ' వర్ధంతి

ప్రజాశక్తి-మదనపల్లె : ఆంగ్లేయులపై తిరగబడ్డ తొలి భారత సింహం ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు రేనాటి సింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతిని అఖిల భారత రెడ్డి సంఘాల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షులు కనుగొండ మద్దిరెడ్డి ఆధ్వర్యంలో కెఎంఆర్ కాంప్లెక్స్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించినారు. ఈ సందర్భంగా మద్దిరెడ్డి మాట్లాడుతూ భారత దేశంలోనే మొదటి సారిగా బ్రిటిష్ వారిని ఎదిరించిన వీరుడు నరసింహారెడ్డి అని పేర్కొన్నారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీన ప్రజల అందరి సమక్షంలో తల నరికి ఊరి నడిబొడ్డున వేలాడదీశారన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన ఆ మహనీయుని వర్ధంతిని కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని అవసరం ఎంతైనా ఉన్నది అని ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కంభం నాగభూషణరెడ్డి, గౌరవ సలహాదారులు తిమ్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు పి.ప్రసాద్‌రెడ్డి, పి.రామ మోహన్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్.సురేందర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి ఎస్.రెడ్డిప్పరెడ్డి, జి.నాగరాజరెడ్డి, ఆర్.శివకుమార్‌రెడ్డి. కె.జయప్రకాశ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సేగు రెడ్డెప్పరెడ్డి, కమ్మిరెడ్డి, కె.అమరనాథ్‌రెడ్డి. పి.రామిరెడ్డి. సి.దినేష్‌రెడ్డి. కె.శివారెడ్డి. ఎం.విజయ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం : ఎంఇఒ

ప్రజాశక్తి-పీలేరు : 2024-25 విద్యా సంవత్సరానికి ప్రయివేటు విద్యా సంస్థల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యా హక్కు చట్టంలో భాగంగా 1వ తరగతిలో 25 శాతం మంది అర్హులైన పిల్లలకు ఉచిత ప్రవేశాలు ఇప్పించడం కోసం ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12 (1) సి ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం 5 నుండి 6 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులు అర్హులన్నారు. 2024 ఫిబ్రవరి 23 నుండి మార్చి 14 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా దరఖాస్తులను cse.ap.gov.in/RTE వెబ్సైట్ లో ఆన్లైన్ చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 1న మొదటి రౌండు, ఏప్రిల్ 15న రెండవ రౌండ్ లాటరీ ద్వారా ప్రవేశ ఫలితాలను ప్రకటించబడుతాయని తెలియజేశారు. ఈ ఉచిత ప్రవేశాలకు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, దారిద్ర రేఖకు దిగువనున్న కుటుంబాలు, బిపిఎల్ లేదా ప్రభుత్వ పేదరిక నిర్మూలన కార్యక్రమాల యొక్క లబ్ధిదారులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, షెడ్యూల్ కులం, షెడ్యూల్ తెగల వారు అర్హులని పేర్కొన్నారు.

కబడ్డీలో ఎఐటిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ తెలియజేశారు. కబడ్డీలో ప్రతిభజన కరిచిన విద్యార్థులను గురువారం కళాశాలలో వారికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19, 20వ తేదీలలో సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సాంస్కృతి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సాంస్కృతి యూత్ పెస్టివల్-2024 పోటీలలో తమ కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. అనంతరం కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో క్రీడలలో రాణించడం వలన మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం తమ కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. వాటిని వినియోగించుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ



కబడ్డీ విజేతలతో కళాశాల అధ్యాపక బృందం

చాటిన విద్యార్థులకు నగదు బహుమతిని అందించి అభినందించారు. అనంతరం కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, విద్యార్థులను అభినందించారు.



బాధితులకు చెక్కు అందిస్తున్న సాయికిరణ్‌రెడ్డి

వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మండలంలోని అయ్యలరాజుపల్లి దళితవాడలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు ముక్కా సాయికిరణ్‌రెడ్డి రూ.30వేలు ఆర్థిక సాయం చేశారు. కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న జెడ్డా సుబ్బరాయుడుకు రూ.15వేలు, వెన్నెముక సమస్యతో బాధపడుతున్న యాముల శివయ్యకు రూ.15వేల చొప్పున చెక్కులను అందించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా నిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో నిరుపేద కుటుంబాల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనున్నానని ఆర్థిక సాయం చేస్తూ ఆదుకుంటున్నారని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో చిన్నవరంపాడు సర్పంచ్ తనయుడు గద్దె వెంకయ్య, అయ్యలరాజు పల్లి యువ నాయకులు చింతు రాజా రెడ్డి, వంకర శివారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాదెండ్ల గౌరయ్య, పొందురు గనాథ్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కవారిపల్లి సర్పంచ్ అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'వైఎస్ఆర్ ఆసరా'

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం ఉదయం పది గంటలకు నాలుగవ విడత వైఎస్ఆర్ ఆసరా, గ్రామ వాలంటీర్ల సేవలకు పురస్కార ప్రధానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, స్త్రీ శక్తి సిబ్బంది ,మండల, గ్రామ మహిళ సమాఖ్యలు, ఆసరా పథకం లబ్ధిదారులు పాల్గొనాలని తెలిపారు.

'అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా'

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఒక్క అవకాశం లభిస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని టిడిపి నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కొండ ఎస్టేట్‌లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీకి ప్రయత్నిస్తున్న కొండా నరేంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యున్నతిని నేను ప్రతి ఒక్క సామాజికవర్గానికి సుపరిచితుడినేనని అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ ప్రజల కోసం అమెరికాలో ఎనిమిదేళ్లు ఉన్న నేను తంబళ్లపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం అమెరికా వదిలి సొంత నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నానని అన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మెండుగా ఉన్నాయని అన్నారు. తనకు టికెట్ రాకపోయినా టిడిపి,జనసేన కూటమి గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యతోనే సమాజం అభివృద్ధి

బి.కొత్తకోట: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని టిడిపి నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర పేర్కొన్నారు.గురువారం బి.కొత్తకోట పరిధిలో వివిధ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను అందించారు. బాలికల,బాలుర పాఠశాలలతో, పాటు శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామాగ్రి ప్యాడ్, పెన్నులు, స్కేలును అందించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి దశ ఎదుగుదలకు తొలి మెట్టు అన్నారు. పదో తరగతిలో వచ్చే మార్కులతోపాటు భవిష్యత్తులో చదివే చదువుల కూడా కొలమానమని చెప్పారు. సమాజంలో ఉన్న దురాగతాలను పోగొట్టడానికి మనకున్న ఏకైక మార్గం విద్య మాత్రమేనని తెలిపారు. బాలుర పాఠశాలలో స్కాట్స్, గైడ్స్ దినోత్సవం సందర్భంగా వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

'చింతమనేని'ని కలిసిన వీరపునేని

ప్రజాశక్తి-రాజంపేట

పట్టణంలో నూతనంగా నిర్మించనున్న కాకతీయ కమ్మ భవన్ శంకుస్థాపన కార్యక్రమానికి కమ్మ సామాజికవర్గ నేత, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఆహ్వానించినట్లు ఓబులవారిపల్లె టిడిపి నాయకులు, బోటుమీదపల్లి సర్పంచ్ వీరపునేని వెంకటయ్యనాయుడు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో కమ్మ సామాజిక వర్గ మలో ఐక్యత కోరవడిందని, అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రభాకర్ సూచించినట్లు ఆయన తెలిపారు. వచ్చే సార్వత్రికల్లో ఎన్నికల్లో ఐక్యతతో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని చెప్పారన్నారు.



చింతమనేనితో వెంకటయ్యనాయుడు

బిఎల్‌ఒలు బాధ్యతగా పనిచేయాలి : ఆర్‌డిఒ


ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలని మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో తహసిల్దారు బాలాజీ రాజు, ఎంపిడిఒ మైథిలి, ఎంఇఒలు పద్మావతి, నారాయణలతో కలసి బిఎల్‌ఒలు, సూపర్వైజర్లు లకు ఎన్నికల సరళి పై, నియమ నిబంధనలపై, ఓటరు జాబితాలపై, ఇవిఎంల పనితీరుపై, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై అవగాహన కల్పించారు. ఎన్నికల సరళిలో బిఎల్‌ఒలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు కార్డు, ఓటరు జాబితాలో ఫోటోలు సరిచూసుకోవాలన్నారు. ఇంటి నెంబర్లు, చిరునామాలు వంటి వాటిని తప్పులు లేకుండా సరిచూసుకోవాలన్నారు. ఓటరు జాబితాలోని తప్పులను వారంలోపు చక్కదిద్దాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ అధికారులకు తాగునీటి సదుపాయం, నీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం, వసతి సదుపాయం, భోజనం వంటి సదుపాయాలను చూసుకోవలసిన బాధ్యత బిఎల్‌ఒ లదేనని అన్నారు. ఇవిఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. ఇవిఎంల ఓటింగ్ ప్రక్రియపై ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల నియమ నిబంధనలకు అనుసరించి ఉద్యోగులు తమ విధులను నిర్వహించాలన్నారు. అనంతరం అడుసుపల్లి వద్ద ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం అందుబాటులో లేవని వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిటిలు తపస్విని, సిరాజుద్దీన్, ఎఎస్‌ఒ జగన్నాథం, ఎఒ రమేష్ బాబు, విలేజ్ సర్వేయర్లు, బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.



బిఎల్‌ఒలకు సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ హరిప్రసాద్

మండల అభివృద్ధికి అందరూ సహకరించాలి : ఎంపిపి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వేంపల్లి నూర్జహాన్

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో జగనన్న ప్రభుత్వంలో చెప్పినటువంటి పథకాలు మండలంలోని ప్రతి ఒక్క ఇంటికి లబ్ధి చేకూరిందని అన్నారు. ఈ పథకాలపై ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరికి తెలియజేసి, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా చూడాలని అన్నారు. ముఖ్యంగా సమావేశంలో 2020 వ సంవత్సరం జనవరి నుంచి అక్టోబర్ వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన బిల్లులపై నీటిపారుదలశాఖపై ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున నిరసన తెలిపి, బిల్లులను మంజూరు చేయాలని వాగ్వాదం చేవారు. ఎంపిడిఒ జోక్యం కలిగించుకొని త్వరితగతిన నీటి బిల్లులు మంజూరు చేసే విధంగా పై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని నీటిపారుదల శాఖను ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యపై మరికుంటపల్లి సర్పంచ్ రెడ్డిరామ్ లేవనెత్తగా గత నాలుగు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేయలేదని సభాముఖంగా తెలిపారు. మండలంలోని కొన్ని శాఖల అధికారులు గైర్వహాజరుపై ఎంపిపి, ఎంపిడిఒలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై గట్టిగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయ విద్యుత్ సమయాన్ని ఒక నిర్ణీత సమయంలో ఇవ్వాలని, పగటిపూట 9గంటల విద్యుత్ ఇవ్వాలని ఎంపిటిసిలు కోరారు. కార్యక్ర మంలో జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, తహశీల్దార్ విజయకుమారి, విద్యుత్ శాఖ, ఉపాధి హామీశాఖ, ఆరోగ్యశాఖ, వెలుగు శాఖ, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, సిద్ధప్ప గారి నాగవేణి, బీబీ ఇస్తియాక్, బాబురెడ్డి, వైస్ ఎంపిపి శ్రీకాంత్ యాదవ్, మండల కో-ఆప్షన్ నెంబర్ రిజ్వానా, పంచాయతీ కార్యదర్శులు, ఎంపి టిసిలు, ముస్లిం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, వేంపల్లి బావాజీ, పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

చౌక దుకాణాలకు సరఫరా చేయు నిత్యావసర సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి కె రఘురాం పేర్కొన్నారు. మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లె పౌరసరఫరాల గోదామును గురువారం ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాంలో నిల్వ ఉన్నటువంటి బియ్యం, చక్కెర, కంది బేడలు, గోధుమపిండి, అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేయు టేక్ హోమ్ రేషన్ కంది బేడలు,పామ్ ఆయిల్, 3కేజీల బియ్యం, మధ్యాహ్న భోజన పథకం కింద సరఫరా చేయు రాగి పిండి, బెల్లం పొడి వస్తువుల నాణ్యతలను, నిలువల తయారీ తేదీ మరియు గడువు సమయంలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఒక్క చౌక దుకాణానికి బియ్యంను కచ్చితంగా తూకాలు వేసి పంపిణీ చేయాలని గోదాము ఇన్‌ఛార్జిని ఆదేశించారు. అనంతరం గోదాము దస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో గోదాము ఇన్‌ఛార్జి మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న రఘురాం

సంక్షేమ సారథి వైఎస్ఆర్ : 'గడికోట'



వైఎస్ఆర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి-చిన్నమండెం

సంక్షేమ సారథి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రెడ్డివారిపల్లె క్రాస్‌లో సింగల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, వైసిపి నాయకులు నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104, అర్హులందరికీ ఇళ్ళు, ఉచిత విద్యుత్, రుణ మాఫీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్ తదితర ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలోని ఎన్నో నీటి ప్రాజెక్ట్ లతో పాటు మన ప్రాంతంలోని వెలిగల్లు, ఝరికోన, శ్రీనివాసపురం , రాయచోటి పట్టణ దాహార్తిని తీర్చారని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఎన్నో విద్యా సంస్థలు, అభివృద్ధి పనులు చేసారని ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం దేవనాథ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ బాటలోనే పయనించి ఆయన ఆశయ సాధన కోసం ప్రతి వైసిపి కార్యకర్త, అభిమానులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బీదగాని శ్యామల, ఎజాస్‌అలీఖాన్, సర్పంచ్ మంజుల, మాజీ ఎంపిటిసి రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, సుధాకర్, చిన్న మల్లి కార్జున, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజ నప్ప, రామాంజులు, శివారెడ్డి,సంకర్, రాజగోపాల్, ఖాజా మోహిద్దీన్, దశరథ పాల్గొన్నారు.

ఆదర్శ, కెజిబివిలో రాష్ట్ర పరిశీలకుల బృందం తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలను, కస్తూర్బా గాంధీ పాఠశాలలను గురువారం లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం (అభ్యసనాభివృద్ధి) రాష్ట్ర పరిశీలన బృందం ఆకస్మిక తనిఖీ చేశారు. సోషల్ విభాగంలో ఎం వసంత కుమార్, సైన్స్‌లో బిడి మధుసూదన్ రెడ్డి, గణితంలో అట్లా నరసింహారెడ్డి, ఇంగ్లీష్ విభాగంలో రహంతుల్లాలు పరిశీలకుల బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యసనా అభివృద్ధి కార్యక్రమం అమలులో భాగంగా తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధన, సాధన పీరియడ్లలో పాటించవలసిన పలు సూచనలు, మెలకువలను ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలలో తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల కొరకు తీసుకోవాల్సిన పలు అంశాల గురించి క్షుణ్ణంగా వివరించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కూడా చదవటం, రాయటం ముందు వరుసలో నిలవాలని సూచించారు. రాబోవు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ చక్రధర్‌రాజు, ఎఎంఒఎస్ రామకృష్ణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ రూత్ మేరీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుల బృందం

క్రికెట్ టోర్నమెంట్ విజేత చింతకాయపల్లి జట్టు



ట్రోఫీతో చింతకాయపల్లి క్రికెట్ జట్టు

ప్రజాశక్తి-నందలూరు

కుంపిణీపురం శ్రీ భోగా ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మదనమోహనపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో చింతకాయపల్లి జట్టు విజేతగా నిలవగా, రన్నర్స్‌గా కుంపినీపురం జట్టు నిలిచింది. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, నల్లతిమ్మయ్యగారిపల్లి సర్పంచ్ గీతాలనరసింహారెడ్డి అందించారు. ద్వితీయ బహుమతి రూ.15 వేలు గుగ్గిళ్ళ ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో చింతకాయపల్లి సర్పంచ్ చుక్కా యానాది, శివకోటి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, కడప శ్రీనివాసులు, చుక్క రమణయ్య, కడప హరి, శివ యాదవ్, ఉపేంద్ర, నరసయ్య, చింతకాయ పల్లి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కోనేరు పునర్నిర్మాణ పనులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలో టిఎన్ కుటుంబీకులు సుమారు వందేళ్ల క్రితం శివాలయం ముందు ఒక కోనేరును ఏర్పాటు చేశారు. చుట్టూ రాతి కట్టడంతో ఆకర్షణీయంగా ఉండేది. ఆలయానికి వచ్చే భక్తులు ఆ కోనేటిలో స్నానం ఆచరించి దేవుడి దర్శనానికి వెళ్లేవారు. ఆ పురాతన కోనేరు శిథిలావస్థకు చేరుకుంది. గుర్తించిన ఉపాధి హామీ ఎపిడి మధుబాబు ఆ కోనేరు పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గురువారం 22 మంది ఉపాధి కూలీలతో ఆ కోనేటిని శుభ్రపరిచిపూడిక తీసే పనులు చేస్తున్నారు. రెండు వైపులా రాతి కట్టడం శిథిలం కావడంతో ఆ కోనేరు రూపు రేఖలు మారిపోయి నీరు లేక ఎండిపోయింది. సుమారు రెండు లక్షల అంచనాల ఖర్చుతో ఆ కోనేరు పునః నిర్మాణ పనులు చేయనున్నట్లు తెలిపారు.



పల్స్ పోలియో సామగ్రిని పరిశీలిస్తున్న డాక్టర్ శరత్‌కమల్

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో మార్చి నెల 3న నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన ఓరల్ పోలియో వ్యాక్సిన్, ఐస్ ప్యాక్స్, వ్యాక్సిన్ క్యారియర్లు, పోలియో చుక్కలు వేసే సిబ్బంది సర్వం సిద్ధం అని మండల వైద్యాధికారి డాక్టర్ శరత్‌కమల్ పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పోలియో చుక్కల సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4800 మంది 0-5 సంవత్సరాలలోపు పిల్ల లకు పోలియో చుక్కలు వేయుటకు 48 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. కావున మండల ప్రజలు తమ ఐదు సంవత్సరాల లోపు పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి, జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, ఎంపిటిసిలు, గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, స్వచ్ఛంద సంస్థల వారు సహకరించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ వెంకటనారాయణ పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో ఎంపిపి, ఉపాధ్యాయులు

కష్టపడి చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి-కలకడ

ప్రతి విద్యార్థి కష్టపడితే విజయం సొంతం అవుతుందని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పది, ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మలంసావలి ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు సాధించిన ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని విద్యార్థులందరూ క్రమశిక్షణతో బాధ్యతగా చదువుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు, టివిలకు దూరంగా ఉండి చదువుపై ఇష్టం పెంచుకొని కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ టైం టేబుల్ వేసుకొని ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని, ఏమైన సమస్యలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగన్నా విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద, జగనన్న విదేశీ విద్యాదీవెన, క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఆడుదాం ఆంధ్ర ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుక వచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మునీంద్ర నాయక్, కోన జడ్‌పి హైస్కూల్ హెచ్ ఎం చెంగల్ రాయుడు, బాలయ్య గారి పల్లి జడ్పీ హైస్కూల్ శ్రీధర్ బాబు, నడిం చర్ల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శంకరయ్య, ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్మయి, మోడల్ స్కూల్ చైర్మన్ మస్తాన్ అహ్మద్, కమిటీ సభ్యులు నరసింహులు, జిలాని, లోకేశ్వర ,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎపిఎండిసి ఎమ్‌డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఎపిఎండిసి ఎమ్‌డిని కలిసిన 'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

మంగంపేట పరిధిలోని కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ, అగ్రహారం తదితర గ్రామాల సమస్య మీద గురువారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి ఎపిఎండిసి ఎమ్‌డి వెంకటరెడ్డిని కలిసి పలు సమస్యలపై చర్చించారు. గ్రామాల సమస్యల మీద చర్చించి అభివృద్ధి విషయంలో గ్రామాల తరలింపు విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని ఎండి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆర్‌ఆర్ సెంటర్ 1 , 1028 ఇళ్లకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు, అగ్రహారం తరలింపు కోసం భూసేకరణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని వాలంటీర్లకు గురువారం స్థానిక ఎఆర్ కల్యాణ మండపంలో అట్టహాసంగా సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని వాలంటీర్లకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వాలంటీర్ వ్యవస్థను దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. అవినీతికి తావులేకుండా అర్హతగల ప్రతి కుటుంబానికి వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందు తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైసిపి నాయకులు నిరంజన్‌రెడ్డి, బాబురెడ్డి, ఎంపిటిసిలు ఎజాస్, రమేష్ శ్యామ్, చంద్ర, రమణ, శ్రీరాములు సర్పంచ్‌లు నజీర్‌బాషా, ముసల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆధార్ కార్డులో వచ్చిన లోపాలను ప్రజలను అడిగి తెలుసు కున్నారు. ఆధార్ ప్రక్రియ నిర్వహిస్తున్న సోని శామ్యూల్‌ను ఎంపిడిఒ అభినం దిం చారు. ఆధార్ కార్డుల తప్పుల్లేకుండా చూడాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, పంచా యితీ సెక్రటరీ జానకి రామచంద్రన్, విఆర్‌ఒ లక్ష్మయ్య, ఎంపిఇఒ సాయి ప్రియ పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వేపూరికోటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వేపూరికోటకు చెందిన బి. కృష్ణప్ప, ఎస్.దస్తగిరిలను అరెస్టు చేసి వారి నుంచి పది కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.